ప్రజలందరికీ నాణ్యమైన వైద్యం


42వ వార్డు రైల్వే న్యూకాలనీ ఆరోగ్య సురక్ష క్యాంప్‌లో రోగులకు మందులు, కేస్ షీట్లను అందజేస్తున్న కె.కె.రాజు


రైల్వే న్యూకాలనీలో వైద్య శిబిరానికి హాజరైన ప్రజలు

- అదే సీఎం వైఎస్ జగన్ లక్ష్యం
- వైఎస్సార్‌సీపీ 'ఉత్తర' సమన్వయకర్త కె.కె.రాజు
- జగనన్న ఆరోగ్య సురక్ష 2వ విడత కార్యక్రమం ప్రారంభం

తాటిచెట్లపాలెం: ప్రజలందరికీ ఉచితంగా నాణ్యమైన వైద్యం అందించడమే ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి లక్ష్యమని నెడ్‌క్యాప్ చైర్మన్, వైఎస్సార్‌సీపీ ఉత్తర సమన్వయకర్త కె.కె.రాజు తెలిపారు. రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా ప్రవేశపెట్టిన జగనన్న ఆరోగ్య సురక్ష 2వ విడత కార్యక్రమం బుధవారం నియోజకవర్గంలో ప్రారంభమైంది. తొలి రోజు జీవీఎంసీ 42, 51 వార్డుల్లో నిర్వహించిన వైద్య శిబిరాలను ముఖ్య అతిథిగా ఆయన ప్రారంభించి, మాట్లాడారు. రాష్ట్ర ప్రజలు ఆరోగ్యంపై ఒక్క రూపాయి కూడా ఖర్చు చేయకూడదని, వారందరికీ నాణ్యమైన వైద్యం అందాలనే మంచి ఉద్దేశంతో జగనన్న ఈ కార్యక్రమానికి శ్రీకారం చుట్టారన్నారు. వలంటీర్ల ద్వారా ఇంటింటా ప్రజల ఆరోగ్య స్థితిగతులపై సర్వే చేసి, అవసరమైన వారికి ఆరోగ్య సురక్ష ద్వారా మరిన్ని సేవలు, వైద్యం అందుబాటులోకి తీసుకురావాలనే ఈ క్యాంపులను ప్రారంభించారన్నారు.


రైల్వే న్యూకాలనీ ఆరోగ్య సురక్ష శిబిరంలో రోగులను పరీక్షిస్తున్న వైద్యుడు

మొదటి విడతలో రాష్ట్ర వ్యాప్తంగా లక్షలాది మంది శిబిరాల్లో పాల్గొని వైద్య సేవలు, పరీక్షలు చేయించుకున్నారని, వారికి ఉచితంగా మందులు అందజేసినట్లు పేర్కొన్నారు. ఈ క్యాంపులను ప్రతి ఒక్కరూ సద్వినియోగం చేసుకోవాలని కె.కె.రాజు కోరారు.

42, 51 వార్డుల్లో..

జీవీఎంసీ 42వ వార్డు రైల్వే న్యూకాలనీలోని డాక్టర్ వైఎస్సార్ పట్టణ ప్రాథమిక ఆరోగ్య కేంద్రం(యూపీహెచ్‌సీ)లో 232 సచివాలయం పరిధి లబ్ధిదారులకు వివిధ వైద్య పరీక్షలు చేసి, అవసరమైన వారికి మందులు అందజేశారు. 51వ వార్డు 286 సచివాలయం పరిధి లబ్ధిదారులకు అంబేడ్కర్ నగర్‌లోని సామాజిక భవనంలో వైద్య పరీక్షలు


51వ వార్డు అంబేడ్కర్ కాలనీలో రోగులకు మందులు అందజేస్తున్న యూపీహెచ్‌సీ సిబ్బంది

చేసి, మందులు అందించారు. జనరల్ సర్జన్, ఆప్తాల్మాలజిస్ట్, పీడియాట్రిషన్‌లు బీపీ, సుగర్ మొదలగు వైద్య పరీక్షలు చేసి అవసరమైన వారికి ఉచితంగా మందులు పంపిణీ చేశారు. వైద్య సేవలు తమ చెంతకే రావడం సంతోషంగా ఉందని స్థానికులు హర్షం వ్యక్తం చేశారు. కార్యక్రమంలో ఆయా వార్డుల కార్పొరేటర్లు ఆళ్ల లీలావతి, రెయ్యి వెంకటరమణ, జీవీఎంసీ ఫ్లోర్ లీడర్ బాణాల శ్రీనివాసరావులతోపాటు పార్టీ నాయకులు బులుసు జగదీష్, ఎస్.ప్రసాదరావు, నాగమణి, అలివేణి, ఏపీడీ పద్మావతి, 232, 286 సచివాలయాల సిబ్బంది పాల్గొన్నారు.

వైద్య శిబిరానికి విశేష స్పందన

సీతంపేట: జగనన్న ఆరోగ్య సురక్ష రెండో దశ


అంబేడ్కర్ కాలనీ వైద్య శిబిరంలో రిజిస్ట్రేషన్ ప్రక్రియను పరిశీలిస్తున్న కె.కె.రాజు

కార్యక్రమంలో భాగంగా బుధవారం 26వ వార్డు అక్కయ్యపాలెం జగ్గారావు బ్రిడ్జి వద్ద చేపల బజారుపైన కమ్యూనిటీ హాల్‌లో నిర్వహించిన వైద్య శిబిరానికి విశేష స్పందన లభించింది. విద్యుత్‌నగర్ యూపీహెచ్‌సీ, సచివాలయం పరిధిలోని ప్రజలు పెద్ద సంఖ్యలో తరలివచ్చి ఉచితంగా వైద్య, రక్త పరీక్షలు చేయించుకుని, అవసరమైన మందులు పొందారు. విద్యుత్‌నగర్ యూపీహెచ్‌సీ డాక్టర్ సుధీర్, స్పెషలిస్ట్ వైద్యులు, ఆర్థోపెడిక్ వైద్యులు రమేష్, చర్మవ్యాధి నిపుణులు డాక్టర్ శ్రావణి, ఆప్తమాలజీ టెక్నీషియన్ అనిత, డెంటల్ టెక్నీషియన్‌లు వైద్య సేవలు అందించారు. 512 మంది వైద్యులచే సేవలు, 312 మంది వివిధ రకాల రక్త పరీక్షలు చేయించుకున్నారు.


అక్కయ్యపాలెం శిబిరంలో కంటి వైద్య పరీక్షలు చేస్తున్న సిబ్బంది

ఉచితంగా మందులిచ్చారు



రెండు రోజుల కిందట తలపై ఇటుక పడటంతో పెద్ద గాయమైంది. కుట్లు పడ్డాయి. ఇక్కడికి డాక్టర్లు వస్తారని మా వలంటీర్ చెప్పడంతో వచ్చాను. వైద్యులు చూసి పర్వాలేదని చెప్పారు, నొప్పి తగ్గడానికి, గాయం మానడానికి పది రోజులకు సరిపడా మందులు ఉచితంగా ఇచ్చారు. నాలాంటి వారికి ఇటువంటి వైద్య సేవలు ప్రయోజనకరమైనవి.

– పి.నూకరత్నం, పువ్వులవారి వీధి, అక్కయ్యపాలెం

చెంతకే వైద్య సేవలు



ప్రభుత్వ వైద్య సేవలు మాకు అందుబాటులో ఉన్నాయని ఆర్పీలు తెలియజేయడంతో తాటిచెట్లపాలెం నుంచి ఇక్కడి వైద్య శిబిరానికి వచ్చాను. సుగర్, బీపీ టెస్టులు ఉచితంగా చేసి మందులు అందజేశారు. చెంతకే వైద్య సేవలు రావడంతో సంతోషంగా ఉంది.

– ఎస్.కుమారి, 42వ వార్డు

వ్యయప్రయాసలు తప్పాయి



చెక్కుడురాయి బిల్డింగ్ దగ్గర నుంచి రైల్వే న్యూకాలనీ మెడికల్ క్యాంప్‌లో చూపించుకునేందుకు వచ్చాను. గతంలో ఆరోగ్య సమస్యలు వస్తే ఏదో ప్రైవేటు హాస్పిటల్‌కు వెళ్లి డబ్బు ఖర్చు చేసేవాళ్లం. నేడు ఇటువంటి శిబిరాల ద్వారా వైద్య సేవలు ఉచితంగా పొందుతున్నాం.

– పి.భారతి, 42వ వార్డు

వైద్య శిబిరాలతో మేలు



గతంలో ఏ ఆరోగ్య సమస్య వచ్చినా ప్రైవేటు ఆస్పత్రుల చుట్టూ తిరిగేవాళ్లం. జగనన్న ఆరోగ్య సురక్ష కార్యక్రమం ద్వారా నేడు మాకు సమీపంలోనే మెడికల్ క్యాంపులు నిర్వహించి, ఎప్పటికప్పుడు ఆరోగ్య పరీక్షలు చేయడం, మందులు ఇవ్వడం ఎంతో ఆనందంగా ఉంది.

– ఎం.ఝాన్సీభాయి, 51వ వార్డు

చాలా సంతోషంగా ఉంది



మాకు సమీపంలోనే వైద్య సేవలు అందించడం చాలా సంతోషంగా ఉంది. ప్రజల ఆరోగ్య పరిరక్షణ విషయంలో విలువైన పరీక్షలు చేయడంతోపాటు, ఖరీదైన మందులు కూడా ఉచితంగా అందజేస్తున్నారు. ఇటువంటి వైద్య శిబిరాలు పేదలకు ప్రయోజనకరంగా ఉంటాయి.

– కావూరి వరహాలు, 51వ వార్డు

క్లుప్తంగా

సావిత్రిబాయి పూలే సేవలు అజరామరం


సావిత్రిబాయికి నివాళులర్పిస్తున్న గొల్లమాల అప్పారావు, దళిత నాయకులు

కంచరపాలెం: మహిళా సాధికారతకు నిలువెత్తు రూపం సావిత్రిబాయి పూలే అని దళిత సేన రాష్ట్ర వర్కింగ్ ప్రెసిడెంట్ గొల్లమాల అప్పారావు కొనియాడారు. దళిత సేన రాష్ట్ర అధ్యక్షుడు పాల్తేటి పెంటారావు పిలుపు మేరకు బుధవారం ఊర్వశి జంక్షన్‌లోని దళిత సేన కార్యాలయంలో సంఘ సంస్కర్త సావిత్రిబాయి జయంతి వేడుకలు ఘనంగా నిర్వహించారు. ఆమె చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా అప్పారావు మాట్లాడుతూ కుల వివక్షను రూపుమాపడంలో జ్యోతీరావ్, సావిత్రిబాయి పూలే దంపతుల పోరాటం అజరామమన్నారు. దళిత సేన నగర మహిళా కన్వీనర్ గొల్లమాల మీనా, కామేశ్వరరావు, ఝాన్సీరాణి, సీతారామ్, రాణి, జయకుమార్, రాంజీ అభ్యుదయ సేవా సంఘం ప్రతినిధులు పాల్గొన్నారు.

టార్పాలిన్ల పంపిణీ


తుపాను బాధితులకు టార్పాలిన్లు అందిస్తున్న సొండి సురేష్


కంచరపాలెం: జీవీఎంసీ 55వ వార్డు కంచరపాలెం గాంధీనగర్‌లో మిచాంగ్ తుపాను బాధితుల ఇళ్ల కోసం దళిత బహుజన్ రిసోర్స్ సెంటర్(డీబీఆర్‌సీ) ఆధ్వర్యంలో బుధవారం టార్పాలిన్లు వితరణ చేశారు. ముఖ్య అతిథి వైఎస్సార్‌సీపీ ఎస్సీ సెల్ సీనియర్ నాయకుడు సొండి సురేష్ చేతుల మీదుగా బాధితులకు వాటిని అందజేశారు. ఆయన మాట్లాడుతూ డీబీఆర్‌సీ సంస్థ సేవలు అభినందనీయమన్నారు. సుమారు 150 మందికి టార్పాలిన్లు పంపిణీ చేసినట్లు సంస్థ నిర్వాహకులు తెలిపారు. కార్యక్రమంలో ఫీల్డ్ కో–ఆర్డినేటర్ కె.నిఖిల, కమ్యూనిటీ మొబిలైజర్ అజయ్‌కుమార్, అప్పారావు, ధనలక్ష్మి, వలంటీర్ పద్మజ, సచివాలయ సిబ్బంది, సంస్థ సభ్యులు పాల్గొన్నారు.

రహదారి పనుల పరిశీలన


కళింగనగర్‌లో రోడ్డు పనులను పరిశీలిస్తున్న కార్పొరేటర్ రెయ్యి వెంకటరమణ

తాటిచెట్లపాలెం: జీవీఎంసీ 51వ వార్డు కళింగనగర్‌లో ఇటీవల మంజూరైన రహదారి పనులను బుధవారం కార్పొరేటర్ రెయ్యి వెంకటరమణ పరిశీలించారు. ఇక్కడ జీవీఎంసీ నిధులతో రోడ్లు, డ్రైనేజీలను నిర్మిస్తున్నారు. కార్యక్రమంలో ఎం.దమయంతి, వై.వరలక్ష్మి, కె.శ్యామ్, రెయ్యి గణేష్, వర్క్స్ ఇన్‌స్పెక్టర్ శ్యామ్ తదితరులు పాల్గొన్నారు.

ఎంఈవో కార్యాలయానికి బీరువా వితరణ


బీరువా అందజేస్తున్న ఏపీటీఎఫ్ ప్రతినిధులు

సీతంపేట: ఆంధ్రప్రదేశ్ టీచర్స్ ఫెడరేషన్(ఏపీటీఎఫ్) సంఘానికి విశాఖ జిల్లా గౌరవ అధ్యక్షుడిగా ఎన్నికైన అక్కయ్యపాలెం ఎన్జీజీవోస్ కాలనీ జీవీఎంసీ హైస్కూల్ సీనియర్ ఉపాధ్యాయుడు ఆర్.శ్రీనివాసరావును స్కూల్ హెచ్‌ఎం లక్ష్మీ నరస, ఉపాధ్యాయ సిబ్బంది బుధవారం పాఠశాల ఆవరణలో సన్మానించారు. ఏపీటీఎఫ్ తరఫున సీతమ్మధార ఎంఈవో కార్యాలయానికి ఒక బీరువాను వితరణ చేశారు. కార్యక్రమంలో జిల్లా ప్రధాన కార్యదర్శి టి.రామకృష్ణారావు, కార్యదర్శి ఎస్.పి.నాయుడు, కౌన్సిలర్లు, కార్యవర్గ సభ్యులు పాల్గొన్నారు.

'సామాజిక సాధికార బస్సుయాత్ర'కు ఏర్పాట్లు


సామాజిక సాధికార బస్సుయాత్ర పోస్టర్లను ఆవిష్కరిస్తున్న వైఎస్సార్‌సీపీ ఉత్తర సమన్వయకర్త కె.కె.రాజు, కార్పొరేటర్లు, నాయకులు

సీతంపేట: ఈ నెల 6న ఉత్తర నియోజకవర్గంలో నిర్వహించనున్న వైఎస్సార్‌సీపీ సామాజిక సాధికార బస్సుయాత్రపై నెడ్‌క్యాప్ చైర్మన్, వైఎస్సార్‌సీపీ ఉత్తర సమన్వయకర్త, కె.కె.రాజు ఆధ్వర్యంలో బుధవారం అక్కయ్యపాలెం షాదీఖానాలో సన్నాహక సమావేశం జరిగింది. ముందుగా సావిత్రిబాయి పూలే జయంతి వేడుకలు నిర్వహించారు. ఆమె చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా కె.కె.రాజు మాట్లాడుతూ సమాజంలో సామాజిక రుగ్మతలు రూపుమాపడానికి విశేష కృషి చేసిన జ్యోతీరావు పూలే వెంట ఉంటూనే మహిళల అక్షరాస్యత కోసం సావిత్రీబాయి శ్రమించారన్నారు. అనంతరం సామాజిక సాధికార బస్సుయాత్ర పోస్టర్ ఆవిష్కరించారు. బస్సుయాత్ర ఏర్పాట్లు, ఏవిధంగా విజయవంతం చేయాలి తదితర విషయాలపై చర్చించారు. కార్యక్రమంలో మాజీ ఎమ్మెల్యే తైనాల విజయ్‌కుమార్, డిప్యూటీ మేయర్ కటుమూరి సతీష్, జీవీఎంసీ ఫ్లోర్ లీడర్ బాణాల శ్రీనివాసరావు, డిప్యూటీ ఫ్లోర్ లీడర్ అల్లు శంకరరావు, స్టాండింగ్ కమిటీ సభ్యులు చల్లా రజనీ ఈశ్వరరావు, కంటిపాము కామేశ్వరి, కార్పొరేటర్లు కె.అనిల్‌కుమార్‌రాజు, సాడి పద్మారెడ్డి , సారిపిల్లి గోవింద్, ఆళ్ల లీలావతి శ్రీనివాస్, పి.ఉషశ్రీ, వావిలపల్లి ప్రసాద్, రెయ్యి వెంకటరమణ, బర్కత్ అలీ, కె.వి.ఎన్.శశికళ, కో ఆప్షన్ సభ్యుడు సేనాపతి అప్పారావు, వార్డు అధ్యక్షులు, సీనియర్ నాయకులు, డైరక్టర్లు, యువజన విభాగం నాయకులు, సచివాలయం కన్వీనర్లు, గృహసారథులు పాల్గొన్నారు.

జీవీఎంసీ కమిషనర్‌కు కృతజ్ఞతలు


జీవీఎంసీ కమిషనర్ సాయికాంత్ వర్మకు వినతిపత్రం అందిస్తున్న కార్పొరేటర్ కవిత

కంచరపాలెం: కొండవాలు ప్రాంతాల అభివృద్ధికి నిధులు మంజూరు చేసినందుకు గానూ జీవీఎంసీ కమిషనర్ సాయికాంత్ వర్మకు 48వ వార్డు కార్పొరేటర్ గంకల కవిత కృతజ్ఞతలు తెలిపారు. ఈమేరకు బుధవారం జీవీఎంసీ ప్రధాన కార్యాలయంలో ఆయనను మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ కొండవాలులో మెట్ల మార్గాలు, సీసీ, బీటీ రోడ్లు, కాలువలు, డ్రైనేజీలు, రిటర్నింగ్ వాల్స్ తదితర అభివృద్ధి పనులను వేగవంతంగా చేపట్టారని తెలిపారు. జైభారత్‌నగర్, పల్నాటీ కాలనీ, ఇందిరానగర్–1 ప్రాంతాల్లో తాగునీటి బోర్లు, 10 రింగ్ పోల్స్, ఇందిరానగర్–2 జాతీయ రహదారికి ఆనుకుని ఓపెన్ జిమ్ ఏర్పాటు చేయాలని కోరారు. పలు అభివృద్ధి పనులపై కమిషనర్‌కు కార్పొరేటర్ కవిత, బీజేపీ నాయకుడు గంకల అప్పారావులు వినతిపత్రం అందించి, వార్డు ప్రజల తరఫున అభినందనలు తెలిపారు.

పింఛన్ పెంపు దేశానికే ఆదర్శం

- వైఎస్సార్‌సీపీ 'ఉత్తర' సమన్వయకర్త కె.కె.రాజు
- లబ్ధిదారులకు రూ.3 వేల పెన్షన్ పంపిణీ


శాంతినగర్‌లో పెన్షన్ సొమ్ము అందజేస్తున్న డిప్యూటీ మేయర్ కటుమూరి సతీష్


బాలయ్యశాస్త్రి లేఅవుట్‌లో తలుపులమ్మకు వృద్ధాప్య పింఛన్ అందిస్తున్న కె.కె.రాజు

సీతమ్మధార: అవ్వాతాతల మోములో చిరునవ్వులు చిందించాలనే సంకల్పంతో ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి పింఛన్ సొమ్మును రూ.3 వేలకు పెంచారని, ఇది దేశానికి ఆదర్శంగా నిలిచిందని నెడ్‌క్యాప్ చైర్మన్, వైఎస్సార్‌సీపీ ఉత్తర సమన్వయకర్త కె.కె.రాజు అన్నారు. 14వ వార్డు కార్పొరేటర్ కె.అనిల్‌కుమార్‌రాజుతో కలిసి ఆయన బుధవారం 122 సచివాలయం పరిధి బాలయ్యశాస్త్రి లేఅవుట్–2లో లబ్ధిదారులకు పెన్షన్లు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా కె.కె.రాజు మాట్లాడుతూ ఇచ్చిన మాటకు కట్టుబడిన గొప్ప నాయకుడు సీఎం వైఎస్ జగన్ అని కొనియాడారు. కార్యక్రమంలో నాయకులు కిరణ్‌రాజు, కోడూరి సత్యనారాయణ, బోగ లింగేశ్వరరావు, ఎం.సునీల్‌కుమార్, సచివాలయ కన్వీనర్లు, వలంటీర్లు పాల్గొన్నారు.

పెన్షనర్ల సంతోషమే జగనన్న లక్ష్యం

కంచరపాలెం: అవ్వాతాతలు, దివ్యాంగులు, వితంతువుల సంతోషమే లక్ష్యంగా ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి పనిచేస్తున్నారని జీవీఎంసీ డిప్యూటీ మేయర్ కటుమూరి సతీష్ అన్నారు. 46వ వార్డులో బుధవారం జోన్–5 అధికారులతో కలిసి ఆయన పింఛన్ల పంపిణీ కార్యక్రమాన్ని ప్రారంభించారు. పెంచిన రూ.3 వేల పెన్షన్ కానుకను శాంతినగర్ తదితర ప్రాంతాల్లో లబ్ధిదారులకు అందజేశారు. ఈ సందర్భంగా సతీష్ మాట్లాడుతూ వివక్షకు తావు లేకుండా అర్హత గల ప్రతి ఒక్కరికీ సంక్షేమ ఫలాలు అందిస్తున్నట్లు చెప్పారు. కార్యక్రమంలో కో–ఆప్షన్ మెంబర్ ఎస్.అప్పారావు, ఏపీడీ అధికారి పద్మావతి, సీవో వరలక్ష్మి, కె.చిన్నా, బి.గోవింద్, స్వామి నాయుడు, రామనాయుడు, సచివాలయ కన్వీనర్లు, గృహసారథులు, పార్టీ నాయకులు పాల్గొన్నారు.

కొలువుదీరిన 'వనితా వాకర్స్' కొత్త కార్యవర్గం

మురళీనగర్: స్థానిక వనితా వాకర్స్ క్లబ్ నూతన కార్యవర్గ ప్రమాణ స్వీకారోత్సవం బుధవారం ఉత్సాహంగా జరిగింది. మురళీనగర్ వైశాఖి స్పోర్ట్స్ పార్కు వనితా భవన్‌లో క్లబ్ ప్రస్తుత అధ్యక్షురాలు వి.ప్రభాశర్మ అధ్యక్షతన నిర్వహించిన ప్రత్యేక సమావేశంలో వాకర్స్ ఇంటర్నేషనల్ అధ్యక్షుడు మురళీమోహన్‌రావు కొత్త కార్యవర్గ సభ్యులతో ప్రమాణ స్వీకారం చేయించారు. క్లబ్ నూతన అధ్యక్షురాలిగా పి.ప్రభావతి, కార్యదర్శిగా ఎం.జయ, కోశాధికారి జి.షీలా, జాలి వాకర్‌గా ఎం.ప్రమీలరావు, ఉపాధ్యక్షురాలిగా పి.మహాలక్ష్మి, ఆర్.సుదిత, సంయుక్త కార్యదర్శి ఎస్.రత్నకుమారి, జి.శిరీష లత, సంయుక్త కోశాధికారిగా కె.భానుమతి, బులిటెన్ ఎడిటర్ ఆర్.స్నేహలత, సీనియర్ కమిటీ సభ్యులుగా ఎ.మంగాదేవి, కె.బిందురాణి, సిహెచ్.జ్యోతి, కె.వినీల, బోర్డ్ ఆఫ్ డైరెక్టర్స్‌గా సిహెచ్.పద్మావతి, సురేందర్ గౌడ్, పి.సుభద్ర, ఎం.సరిత, ఎం.స్వాతి మాధురి ప్రమాణం చేశారు. కార్యక్రమంలో వైశాఖి పార్కు అధ్యక్షుడు సనపల వరప్రసాద్, డిస్ట్రిక్ట్–101 గవర్నర్ టి.రంగారావు, వాకర్స్ ఇంటర్నేషనల్ కార్యదర్శి ప్రదీప్, కోశాధికారి మురళి, అడిషనల్ సెక్రెటరీ జనరల్ ఆర్.సత్యనాథం, పూర్వ గవర్నర్ యు.సుభ, ఎలెక్ట్ గవర్నర్ కె.ద్వారకానాథ్, క్యాబినెట్ సెక్రెటరీ, బి.సత్యనారాయణ, ఓం వాకర్స్ క్లబ్ అధ్యక్షురాలు వి.ప్రమీల, శ్రీ వైభవ్ క్లబ్ అధ్యక్షురాలు దుర్గాప్రసన్న, హెల్త్ క్లబ్ అధ్యక్షుడు సిహెచ్.శ్రీనివాస రాజు, యూనివర్సల్ క్లబ్ అధ్యక్షుడు సిహెచ్.వంశీకృష్ణ పాల్గొన్నారు.


అతిథులతో మురళీనగర్ వనితా వాకర్స్ క్లబ్ నూతన కార్యవర్గ సభ్యులు

సేవా పథంలో నడుద్దాం

మురళీనగర్: కొత్త ఏడాదిలో సరికొత్త ఆలోచనలతో సామాజిక సేవా కార్యక్రమాల నిర్వహణ ద్వారా ప్రజలను నడక, ఆరోగ్యం వైపు నడిపిద్దామంటూ వాకర్స్ ఇంటర్నేషనల్ అధ్యక్షుడు వి.మురళీమోహనరావు పిలుపునిచ్చారు. మురళీనగర్ వాకర్స్ క్లబ్ 2024 సంవత్సరానికి నూతన కార్యవర్గ ప్రమాణ స్వీకారోత్సవం బుధవారం సాయంత్రం వాకర్స్ పార్కులో నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడారు. ఇప్పటికే అనేక ఉత్తమ అవార్డులు అందుకున్న వాకర్స్ క్లబ్ మరింత ఉన్నత స్థానానికి చేరుకోవాలని సూచించారు. నూతన అధ్యక్షుడు పల్లా చంద్రమౌళి, కార్యదర్శి పి.చెల్వరాజు, కోశాధికారి జె.కూర్మారావు, ఉపాధ్యక్షులు ఏపీ సుబ్బారావు, మళ్ల రామకృష్ణ, జాలీవాకర్ ఎస్.ప్రకాశరావు, బోర్డ్ ఆఫ్ డైరెక్టర్లుగా టి.వెంకటరమణ, వడ్డాది అప్పారావు, ఆర్.నాగేశ్వరరావు, యడ్ల దేముడు, జి.వి.యలక్ష్మి, ఎస్.రామమోహనరావు, ఎస్.శ్రీనివాసరావు, సీహెచ్ఎస్ఎస్ ప్రసాదరావు, పి.శ్రీనివాసరావు ప్రమాణం చేశారు. కార్యక్రమంలో డిస్ట్రిక్ట్–101 గవర్నర్ టి.రంగారావు, ఎలెక్ట్ గవర్నర్ కె.ద్వారకానాథ్, పాస్ట్ గవర్నర్ యు.శుభ, అడిషనల్ సెక్రెటరీ జనరల్ ఆర్.సత్యానాథం, పలువురు వాకర్స్ ప్రతినిధులు పాల్గొన్నారు.


వాకర్స్ క్లబ్ నూతన కార్యవర్గ సభ్యులు

పద్యార్చనకు ప్రశంసాపత్రాలు


ప్రశంసాపత్రాలతో ఎన్జీజీవోస్ కాలనీ జీవీఎంసీ హైస్కూల్ ఉపాధ్యాయులు, విద్యార్థులు

సీతంపేట: తానా ఆధ్వర్యంలో తెలుగు సంఘాల సమన్వయంతో వందే విశ్వమారతం పేరుతో నిర్వహిస్తున్న అమ్మ, నాన్న, గురువు పద్యార్చన కార్యక్రమంలో పాల్గొన్న అక్కయ్యపాలెం ఎన్జీజీవోస్ కాలనీ జీవీఎంసీ హైస్కూల్ విద్యార్థులు, ఉపాధ్యాయులకు ప్రశంసాపత్రాలు అందజేశారు. తానా సంఘం పంపిన ప్రశంసాపత్రాలను బుధవారం స్కూల్ హెచ్‌ఎం లక్ష్మీ నరస చేతుల మీదుగా ఉపాధ్యాయులు ఆర్.శ్రీనివాసరావు, ఎ.జె.జ్యోతి, ఆర్.రాధిక, వి.ధర్మారావు, జి.వి.ఆర్.సుబ్రమణి, డి.నిర్మల, వై.రామలక్ష్మి, 50 మంది విద్యార్థులకు అందజేశారు.

వైభవంగా ధనుర్మాస దీపారాధన


సహస్ర దీపాలంకరణలో శ్రీనివాసుడు



లలితా పీఠంలో దీపాలు వెలిగిస్తున్న భక్తులు

సీతంపేట: ధనుర్మాస వ్రత మహోత్సవాల్లో భాగంగా 19వ రోజు బుధవారం లలితానగర్ లలితా పీఠంలో కుత్తు విళక్కు కార్యక్రమం వైభవంగా జరిగింది. భక్తులు పెద్ద సంఖ్యలో పాల్గొని శ్రీరంగనాథస్వామి, గోదాదేవి సన్నిధిలో దీపాలు వెలిగించి పూజలు చేశారు. సాయంత్రం పద్మావతీ సమేత వెంకటేశ్వరస్వామి కల్యాణం శాస్త్రోక్తంగా జరిపించారు. అనంతరం కల్యాణ శ్రీనివాసుడికి సహస్ర దీపాలంకరణ చేశారు. లలితా పీఠం మేనేజర్ మన్నవ కృష్ణసేన్ ఏర్పాట్లు పర్యవేక్షించారు.

రేపు విద్యుత్ ఉండని ప్రాంతాలు

మురళీనగర్: జోన్–2 డివిజన్ మర్రిపాలెం సెక్షన్ పరిధి 33/11 ఇండస్ట్రియల్ ఎస్టేట్ సబ్ స్టేషన్, మర్రిపాలెం వుడా లేఅవుట్ 11 కేవీ ఫీడర్లలో నిర్వహణ పనుల కారణంగా శుక్రవారం విద్యుత్ సరఫరాకు అంతరాయం కలుగుతుందని ఏపీఈపీడీసీఎల్ జోన్–2 ఈఈ బీకే నాయుడు ఒక ప్రకటనలో తెలిపారు. ఈ మేరకు ఇండస్ట్రియల్ ఎస్టేట్ ఏరియా, మర్రిపాలెం, ప్రభుత్వ ఐటీఐ, కెమికల్ ఇంజినీరింగ్ కాలేజీ, జ్యోతినగర్, గౌతమ్ గార్డెన్స్, హ్యాపీ హోమ్స్ అపార్ట్‌మెంట్స్, సిద్ధార్థనగర్, సంకురుపేట, శ్రీరామ్‌నగర్, లక్ష్మీనివాస్ అపార్ట్‌మెంట్, బర్మా క్యాంపు, మర్రిపాలెం వుడా లేఅవుట్, లీడర్ ప్రెస్ ప్రాంతాల్లో ఉదయం 9 నుంచి మధ్యాహ్నం 2 గంటల వరకు విద్యుత్ సరఫరా ఉండదన్నారు.

వాల్తేర్ డివిజన్ పరిధిలో సేఫ్టీ ఆడిట్


పెందుర్తి రైల్వేస్టేషన్‌లో తనిఖీలు చేస్తున్న డీఆర్‌ఎం సౌరభ్ ప్రసాద్, డివిజనల్ అధికారులు

తాటిచెట్లపాలెం: వాల్తేర్ డివిజన్ కొరుకొండ రైల్వే స్టేషన్ పరిధిలోని లెవెల్ క్రాసింగ్స్ వద్ద డీఆర్‌ఎం సౌరభ్ ప్రసాద్, ఏడీఆర్‌ఎం, సీనియర్ అధికారులతో కలిసి బుధవారం సేఫ్టీ ఆడిట్ నిర్వహించారు. కొరుకొండ స్టేషన్ యార్డ్ వద్ద గల భద్రతా సంబంధిత ఓవర్ హెడ్ ఎక్విప్‌మెంట్, పాయింట్స్, క్రాసింగ్స్, ట్రాక్ సర్క్యూట్స్ వంటి భద్రతా పరికరాలను పరిశీలించారు. విశాఖపట్నం–పలాస మెయిన్ లైన్‌లోని యార్డ్ లే అవుట్, ట్రాక్స్, రిలే రూమ్స్, బ్యాటరీ రూం, సిగ్నల్ వ్యవస్థలను క్షుణ్ణంగా తనిఖీలు చేశారు. ఆయా ప్రాంతాల్లో సిబ్బందితో డీఆర్‌ఎం ముఖాముఖి మట్లాడారు. నిర్దేశిత భద్రతా ప్రమాణాలను ఆయా ప్రాంతాల్లో పాటిస్తున్నారో లేదో తెలుసుకునేందుకు ఈ సేఫ్టీ ఆడిట్ నిర్వహించినట్లు రైల్వే అధికారులు తెలిపారు. అనంతరం పలువురు బృంద సభ్యులు పెందుర్తి రైల్వే స్టేషన్‌లో ప్లాట్‌ఫాంలు, వెయిటింగ్ రూంలు, ప్రవేశ ద్వారాలు, యార్డ్ ప్లానింగ్‌లను పరిశీలించారు.